

కొమురవెల్లి మల్లన్న ఆలయం


నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I హైదరాబాద్, శనివారం 13 జూలై 2024 SANGAREDDY




చిలిపిచెడ్ మండలంలో చందూర్ ఎత్తిపోతల ప్రాజెక్టును కప్పేసిన ముళ్లపొదలు

## కొమురవెల్లి మల్లన్న.. గిదేందన్నా!

- రెగ్యులర్ ఈవో లేక గాడితప్పిన పాలన
- ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్న సిబ్బంది
- తరుచూ గొడవపడుతున్న ఉద్యోగులు
- అభివృద్ధి పనుల్లో కనిపించని పురోగతి
- కల్యాణోత్సవం నాటికి అమ్మవార్లకు కిరీటాలు పూర్తయ్యేనా
- పట్టించుకోని దేవాదాయశాఖ.. సమీక్షించని జిల్లా మంత్రులు

చేర్యాల, జూలై 12 : సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధిని కాంగ్రెస్ సర్కారు విస్మరిస్తున్నది. ఈ ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడంతో అభివృద్ధి పనులతో పాటు పరిపాలనా ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలే దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రస్తుత ఇన్‌చార్జి ఈవో ఎ.బాలాజీ 2020 నుంచి ఇక్కడ విధులు నిర్వహిస్తూ వేతనం హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కార్యాలయం నుంచి తీసుకుంటున్నారు. మల్లన్న ఆలయంలో పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేయడానికి, సిబ్బంది మధ్య చోటేచేసుకుంటున్న గొడవలు, కేసులు తదితర సమస్యల నేపథ్యంలో రెగ్యులర్ ఈవోను నియమించాలనే వినతిని దేవాదాయశాఖ ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల టంకశాల వెంకటేశ్ అనే అధికారిని రెగ్యులర్ ఈవోగా నియమిస్తూ ఆర్డర్లు జారీ అయ్యాయి. కానీ, ఆయన వేతనం కొమురవెల్లి మల్లన్న ఆలయం నుంచి తీసుకోవాలని, విధులు మాత్రం దేవాదాయశాఖ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించాలని ఆర్డర్‌లో పేర్కొన్నారు. లాంగ్ స్టాడింగ్ ఉద్యోగులను బదిలీ చేస్తామనడంతో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులతో పాటు కొట్లాడుకున్న ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని ఇటీవల భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రకటించినా దానికి అతీగతీ లేదు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆలయ అభివృద్ధిని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ ఏడాది డిసెంబర్ 29న జరిగే మల్లన్న కల్యాణోత్సవం రోజున అమ్మవార్లకు బంగారు కిరీటాలను సమర్పిస్తామని మంత్రి కొండా సురేఖ ప్రకటించినా, కిరీటాల తయారీకి సంబంధించి ఎలాంటి పురోగతి లేదు. రెగ్యులర్ ఈవో లేక మల్లన్న క్షేత్రంలో పాలన గాడి తప్పుతున్నదనే విమర్శలు ఉన్నాయి. కోట్లాది రూపాయలతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పురోగతి కనిపించడం లేదు. క్యూలైన్ నిర్మాణాలు, 50 కాటేజీల భవనాల పనులు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా ఉంది. ఇద్దరు ఏఈవోలు, 35 మంది సిబ్బంది, 27 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, 63 మంది దినసరి వేతనంతో ఆలయంలో సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. అభివృద్ధి పనుల నిర్వహణ కోసం నల్లగొండ జిల్లా నుంచి వచ్చే డీఈతో పాటు మరో ఏఈ విధులు నిర్వహిస్తున్నారు.ఈవో లేని సమయంలో విధులు నిర్వహించాల్సిన ఏఈవోలు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలయని పరిస్థితి ఉంది. ఉద్యోగుల్లో సమన్వయం కరువైంది. ఇటీవల ముగ్గురు ఉద్యోగులు కొట్టుకుని పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లారు. అభివృద్ధి పనులను నిత్యం పర్యవేక్షించాల్సిన డీఈ, ఏఈలు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## జోరుగా వరి నాట్లు

- మెదక్ జిల్లాలో ఊపందుకున్న పనులు
- యూపీ, బీహార్, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు
- తక్కువ ఖర్చుతో త్వరగా నాట్లు
- కూలీల కొరతను అధిగమించిన రైతులు
- తక్కువ ఖర్చుతో ఇతర రాష్ట్రాల కూలీలతోనే పనులు



వరినారు తీస్తున్న కూలీలు

కౌడిపల్లి, జూలై 12 : వర్షాకాలం మొదలు కావడంతో వరినాట్లు జోరందుకున్నాయి. దీంతో గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడింది. నాటువేసే సమయం అయిపోతుందనే ఉద్దేశంతో గ్రామాల్లోని కొందరు యూపీ, బీహార్, పశ్చిమబెంగాల్‌కు చెందిన కూలీలను పిలిపించి నాట్లు వేయిస్తున్నారు. తక్కువ ఖర్చుతో త్వరగా నాట్లు వేస్తున్న కూలీల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. మెదక్ జిల్లాలో వరినాట్లకు మంచి డిమాండ్ ఉండడంతో ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల నుంచి దాదాపు 100టీమ్‌లు వచ్చాయి. ఒక్కో టీమ్‌లో 15 నుంచి 20 మంది కూలీల చొప్పున ఉన్నారు. ఆయా రాష్ట్రాల నుంచి వచ్చిన వారు టీమ్‌లుగా విడిపోయి సాగు ఎక్కువగా ఉండే ప్రాంతాలకు చేరుకొని జోరుగా నాట్లేస్తున్నారు. ఇక్కడి మహిళా కూలీల ద్వారా ఎకరా నాటేసేందుకు రూ.5 నుంచి 6వేలతో పాటు ఆలస్యం అవుతోంది. అదే యూపీ, పశ్చిమబెంగాల్, బీహా ర్ కూలీలు ఎకరాకు రూ.4500 చొప్పున తీసుకుంటున్నారు. స్పీడ్‌గా నాటేస్తున్నారు. ఉదయం 6గంటలకే పొలంలో దిగి సాయంత్రం వరకు ఎనిమిదెకరాలు నాటు పూర్తి చేస్తున్నారు. ఖర్చు తక్కువ అవుతుండటం, త్వరగా పని పూర్తవడంతో ఎక్కువ మంది రైతులు ఇతర రాష్ట్రాల కూలీలతోనే నాటు వేయిస్తున్నారు.

### ఉపాధి కోసం ఇక్కడికొస్తున్నాం



మా రాష్ట్రంలో సరైన పనుల్లేవు. అందుకే ఇక్కడికి ఉపాధి కోసం వస్తున్నాం. ప్రతి ఏడాది పంటల సీజన్‌లో రెండు నెలల పాటు వరినాట్లు వేసి సంపాదిస్తాం. ఆ తర్వాత సొంత ఊర్లకు వెళ్లి కుటుంబాలను పోషించుకుంటాం. అక్కడ రోడ్లపై చెరుకు రసం అమ్ముతూ అడ్డా కూలీలుగా పనిచేస్తాం.

- బడత్ సర్దార్ కోయికల్లి, పశ్చిమబెంగాల్

### టీమ్‌వర్క్‌తో లాభం



ఇక్కడ రెండు సీజన్లలో మాకు వరి నాటు వేసే పని దొరుకుతుంది. టీమ్ వర్క్‌తో లాభం ఉంటుంది. ఒక టీం ఒక రోజులో ఎనిమిది ఎకరాలు నాటేస్తుంది. ఎకరాకు రూ.4500 చొప్పున అందరం కలిసి రూ.30వేలు సంపాదిస్తాం. రోజుకు ఒక్కొక్కరికీ రూ.1450 చొప్పున రెండు నెలల్లో రూ.87వేల వరకు సంపాదిస్తాం.

- సుబుత్‌కల్ కట్టు, పశ్చిమబెంగాల్

## అంతర్ జిల్లా దొంగల ముఠా అరెస్ట్

- 43 తులాల బంగారం, 5 కిలోల వెండి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సంగారెడ్డి జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావ్

సంగారెడ్డి, జూలై 12: సంగారెడ్డి జిల్లాలోని శివారు గ్రామాల్లో తాళాలు వేసిన ఇండ్లను ఎంచుకుని రాత్రివేళల్లో నేరాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను అరెస్ట్ చేశామని జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావ్ వెల్లడించారు. శుక్రవారం ఎస్పీ కార్యాలయంలో దొంగలు దోచుకున్న 43 తులాల బంగారు, 5 కిలోల వెండి ఆభరణాలు, 2 మోటర్ సైకిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకరులకు వెల్లడించారు. సిర్గాపూర్ మండలం చందర్‌నాయక్ తండాకు చెందిన జాదవ్ జైరామ్, జాదవ్ శంకర్‌లతోపాటు నారాయణఖేడ్ మండలం హంగీర్గా తాండ చందర్‌నాయక్ కలిసి చోరీలకు పాల్పడుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు. వీరు చోరీ చేసిన సొత్తును జాదవ్ మాలిబాయి, రాథోడ్ రాఖలీలు కొనుగోలు చేసేవారిని ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాల్లో తాళాలు వేసిన ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్నారన్నారు. జల్సాలకు అలవాటు పడి త్వరగా డబ్బు సంపాదించే మార్గంలో చోరీలు చేస్తూ దొరికారన్నారు. జూన్ 2న అర్ధరాత్రి అందోల్ మండలం ఎర్రారంలో ఎనిమిది తాళం వేసిన ఇండ్లు, 8న మాసాన్‌పల్లిలో తాళాలు వేసిన నాలుగు ఇండ్లు, 14న చౌటకూర్‌లో ఐదు ఇండ్లల్లో తాళాలు పగులగొట్టి చోరీలకు పాల్పడుతూ బంగారు, వెండి ఆభరణాలు, నగదు దోచుకున్నారని చెప్పారు. వీరిపై జోగిపేట, పుల్‌కల్ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయని చెప్పారు. సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్, జోగిపేట ఇన్‌స్పెక్టర్ అనిల్‌కుమార్ పర్యవేక్షణలో పుల్‌కల్, జోగిపేట ఎస్‌ఐలు శ్రీకాంత్, అనిల్‌కుమార్ తమ సిబ్బందితో సిర్గాపూర్ మండలం బిబియా నాయక్ తండాలో ఉదయం 6 గంటలకు ముఠాను అదుపులోకి తీసుకున్నారని అదనపు ఎస్పీ చెప్పారు. అనంతరం విచారణలో చేసిన నేరాలను ఒప్పుకోవడంతో వారి దగ్గర దొరికిన సొత్తును స్వాధీనం చేసుకున్నామన్నారు.

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావ్




## ఎత్తిపోసుడెప్పుడో..?

- మరమ్మతులకు నోచుకోని చందూర్, ఫైజాబాద్, గంగారం ఎత్తిపోతల పథకాలు
- 2000 ఎకరాల ఆయకట్టుకు అందని నీరు
- ఏడేండ్లుగా ఎదురుచూస్తున్న 2200 మంది అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు



చిలిపిచెడ్ మండలం చందూర్ ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

చిలిపిచెడ్, జూలై 12 : సుమారు 2వేల పైచిలుకు ఎకరాల ఆయకట్టు, 2వేల మంది రైతులకు కల్పతరువైన చందూర్, ఫైజాబాద్, గంగారం ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయి.ఈ ఎత్తిపోతల పథకాలు నడవక పోవడంతో ఏడేండ్ల నుంచి నీరందక రైతులు నష్టపోతున్నారు. ఈ సీజ్‌లో అయినా నీళ్లు ఎత్తిపోస్తారా లేదా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలోని చందూర్, ఫైజాబాద్, గంగారం ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి మంజీరా నది ఒడ్డున 2004లో ప్రస్తుత నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీతాలక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారు. 2013లో ఎత్తిపోతల పథకాలను నిర్మించి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చారు. ఎత్తిపోతలు అందుబాటులోకి వచ్చిన తర్వాత చందూర్, ఫైజాబాద్, గంగారం గ్రామాల రైతులు ఏటా రెండు పంటలు పండించారు. రెండేండ్ల క్రితం మంజీరా నది వరదతో ఉప్పొంగడంతో చందూర్, ఫైజాబాద్, గంగారం ఎత్తిపోతలు దెబ్బతిన్నాయి. ఎత్తిపోతలను మట్టి, ముళ్లపొదలు కప్పేశాయి. ప్రాజెక్టు వెళ్లే దారి వరదతో కోతకు గురై ధ్వంసమైంది.మోటర్లు నీట మునిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు,స్టార్టర్లు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి నీరందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### మరమ్మతులు చేయాలి..



కొన్నేండ్లుగా నీళ్లందక పంటలు కోల్పోయాం. వరదలకు ఎత్తిపోతల పథకం మోటర్లు నీట మునిగాయి. పైపులు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టార్టర్లు దెబ్బతిన్నాయి. ఈ పథకాలకు వెళ్లే దారి పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పటి వరకు అధికారులు ఎలాంటి మరమ్మతులు చేపట్టలేదు. ఈసారి వరినాట్లకు సిద్ధంగా ఉన్నారు. ఈ సీజన్‌లో అయినా లిఫ్ట్‌ను ప్రారంభించాలని కోరుతున్నాం.

-దాసరి శేషాద్రి, రైతు, చందూర్ గ్రామం, చిలిపిచెడ్

### రూ.50లక్షలతో ప్రతిపాదనలు..

చందూర్ గ్రామ ఎత్తిపోతల మరమ్మతులకు రూ. 50లక్షలతో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.ఈ సీజన్‌లో రైతులకు నీరందిస్తాం.మోటర్లుకు,ట్రాన్స్‌ఫార్మర్లలకు మరమ్మతులు చేయాలి.లిఫ్ట్‌కు వెళ్లే దారి పూర్తిగా ధ్వంసమైంది.రోడ్డు పనులు పూర్తి చేయగానే ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభిస్తాం.

-జగన్నాథం, లిఫ్ట్ డీఈ, కౌడిపల్లి డివిజన్



దెబ్బ తిన్న చందూర్‌లో ఎత్తిపోతల ప్రాజెక్టు వెళ్లేదారి

## భూమికి బదులు భూమి ఇవ్వాలి

**నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**



రైతులు చేపట్టిన ధర్నాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూలై12 : కొండపోచమ్మ సాగర్ నుంచి సంగారెడ్డి వరకు చేపట్టనున్న కాళేశ్వరం కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న రైతులు శుక్రవారం నర్సాపూర్ పట్టణంలో అంబేద్కర్ చౌరస్తాలో రిలే నిరాహార దీక్ష చేశారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి వారికి సంఘీభావంగా దీక్షలో కూర్చుని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలువ కోసం భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారాన్ని చెల్లించాలని, లేదా భూమికి బదులు భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల నోట్లో మట్టి కొట్టేలా ప్రభుత్వం వ్యవహరిస్తే ఊరుకోమని హెచ్చరించారు. రైతులకు న్యాయంగా రావాల్సిన పరిహారాన్ని చెల్లించాలని కోరారు. ప్రభుత్వంలో ఉన్న లేకున్నా బీఆర్ఎస్ రైతుల పక్షాన పోరాడుతుందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, రైతు సంఘాల నాయకులు మైసయ్య యాదవ్, రైతులు ప్యాట మహేశ్, రామకృష్ణ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ విడుదల చేయాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిద్దిపేట కలెక్టరేట్ ముట్టడి**

సిద్దిపేట కలెక్టరేట్, జూలై 12: ఆరేండ్ల నుంచి రూ.8,243 కోట్ల పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ కలెక్టరేట్ ముట్టడికి విద్యార్థులు స్వచ్ఛందంగా వచ్చారని, రాష్ట్రంలో ప్రజాపాలన చేస్తున్నామని చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. విద్యారంగ సమస్యలపై ఉద్యమిస్తుంటే పోలీసులతో అణచివేయాలని చూస్తున్నారన్నారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతోపాటు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిద్దిపేట కలెక్టరేట్‌ను ముట్టడిస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

### ప్రభుత్వ విధానాలపై గిరిజనుల నిరసన



సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు

హుస్నాబాద్, జూలై 12: ఉద్యోగ నియామకాల్లో, డీఎస్సీ నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పలు గిరిజన సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో గిరిజన సంఘాల నాయకులు ప్లకార్డులతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సత్యం నాయక్ మాట్లాడుతూ గ్రూప్ 1,2,3 ఉద్యోగాల సంఖ్యతోపాటు ఉపాధ్యాయ పోస్టుల సంఖ్యను పెంచిన తర్వాతే నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారంలోకి రాగానే జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందని ఆరోపించారు. డీఎస్సీని వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లంబాడీల వేదిక జిల్లా అధ్యక్షుడు కృష్ణనాయక్, గిరిజన సంఘాల నాయకులు భూక్యా తిరుపతినాయక్, శ్రీనివాస్ నాయక్, లక్‌పతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా**

మెదక్ కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం



మెదక్, జూలై 12 (నమస్తే తెలంగాణ) : విద్యారంగ సమస్యలను పరిష్క రించాలంటూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు సంతోష్, జగన్, ప్రవీణ్ మాట్లాడుతూ... రాష్ట్రంలో పెండింగ్‌లో రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్ లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు.ట్యూషన్ ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని విద్యార్థులను ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇబ్బం దులు గురిచేస్తున్నాయని తెలిపారు.స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక రాష్ట్రంలో 16 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ కళాశాలల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. రామాయంపేటలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులను ఎలుకలు కరుస్తున్నా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదన్నారు. మనోహరాబాద్ మం డలం కూచారంలోని కేజీబీవీ పాఠశాల ఆవరణలో ముళ్లపొదలు, చెత్తాచెదారం పెరిగి దోమలతో విద్యార్థులు చాలా ఇబ్బందులు, నీటి సమస్య వేధిస్తున్నట్లు తెలిపారు. చేగుంటలో ఎస్సీ హాస్టల్ పూర్తిగా శిథిలావస్థకు చేరి చిన్నపాటి వర్షానికి హాస్టల్ మొత్తం ఊరుస్తోందన్నారు. మెదక్ జిల్లా కేంద్రంలో పీజీ కళాశాల ఏర్పాటు చేయాలన్నారు. జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన వసతి కల్పించాలని కోరారు. పాఠశాలలు వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని,అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు,ఎస్ఎంహెచ్ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలన్నారు. ఖాళీగా ఉన్న టీచర్స్, ఎంఈవో, వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. హాస్టళ్లలో హీటర్లు, తాగు నీటి కోసం ఫిల్టర్ మిషను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.


